క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తగరతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. పాఠశాల పూర్వవిద్యార్థి గరికపాటి జానకిరామయ్య ఆర్థిక సాయంతో 44 మందికి అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మధుసూదన రావు, యూటీఎఫ్ నాయకులు ఎం.సురేష్, పాలడుగు సుబ్బారావు, ఆవుల సురేష్, కొమిరిశెట్టి విజయ్, షేక్ షరీఫ్ పాషా, యాగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం



ముప్పాళ్ళ: మండల భవిత పాఠశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ–2 ఎం.సీతారామిరెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.నాగేంద్రమ్మ, కేంద్రం ఉపాధ్యాయులు పి.అర్జున్, ఎల్.శ్రీను, ఎ.శ్రీలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంత..చింత



పెదకూరపాడు: పెదకూరపాడులోని ప్రధాన రహదారిలో గుంత ఏర్పాడి ప్రమాదంగా మారింది. స్థానిక అంబేడ్కర్ బొమ్మకు కూత వేటు దూరంలో హుస్సేన్‌నగరం వైపు వెళ్లే మూల మలుపు వద్ద ఇది ఉంది. మలుపు కావడంతో వాహనదారులకు గమనించక గుంతలో పడి గాయపడుతున్నారు. ఇటీవల ఈ కాలచక్ర రహదారిలో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. గుంతను పూడ్చకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసం పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని శనివారం కోదండరామునిగా అలంకరించి పూజలు చేశారు. వడ్డవల్లి శ్రీరామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి పూలంగి సేవ నిర్వహించారు. సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

క్రోసూరు: ఎస్సీ, ఎస్టీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డీవీఎంసీ సమావేశంలో కోరినట్లు శనివారం గార్లపాటి దాసు తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పలు సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన వెల్లడించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరినట్లు తెలిపారు.

ఏరియా వైద్యశాల కమిటీ సభ్యులకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిని సీనియర్ సివిల్ కోర్టు పీపీ బగ్గి నరసింహారావు శనివారం సత్కరించారు. డాక్టర్ పోట్ల అరుణకుమారి, యెల్లినేడి లక్ష్మీతులసి, జవ్వాజి రామ్మోహన్‌రావు, మారెళ్ల వీరాంజనేయులు (స్వామి), సిరిగిరి మణికంఠను వారి గృహాలకు వెళ్లి అభినందించారు. న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, నాయకులు అంచుల నరసింహారావు, ముసిని బాబు, దాసరి తిరుపతిరావు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

అమరావతి: మండెపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎంఈఓ సీహెచ్ శివబాబు ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ పి.సతీష్, హెచ్‌ఎం అన్నపూర్ణ దేవి పాల్గొన్నారు.

మండలంలోని చాగంటివారిపాలేనికి చెందిన కోటిలింగారెడ్డి నూతన సంవత్సరం రోజు ఉదయం 11.30 గంటలకు తన తండ్రి టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసి, పక్కనే ఉన్న హోటల్ వద్ద సహచరులతో మాట్లాడుతూ కూర్చున్నాడు. గంట తర్వాత వచ్చి చూడగా బండి కనిపించ లేదు. చుట్టూ వెతికినా ఫలితం లేదు. మోపెడ్ చోరీకి గురైందని నిర్ధారించుకుని ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులు షాక్‌కు గురయ్యారు. అది పనిచేయకపోవడంతో ఏమీ చేయాలో తెలియక తల పట్టుకున్నారు. సీసీ కెమెరా పనిచేసి ఉంటే.. మోపెడ్ ఎవరు చోరీ చేశారో తెలిసి ఉండేది.

మండలంలోని తొండపి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త షకీలా గతేడాది డిసెంబర్ 23న బంధువుల ఇంట్లో శుభకార్యానికి గుంటూరు వెళ్లారు. పొద్దుపోవడంతో సత్తెనపల్లిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం ఆమె ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి బంధువులు షకీలాకు సమాచారమిచ్చారు. ఆమె వచ్చి చూడగా బీరువా తాళం పగలకొట్టి అందులోని బంగారు ఆభరణాలు, నగదు మాయవటాన్ని గుర్తించింది. ఇదే రీతిలో గ్రామంలోని ముస్లిం కాలనీలో పలు ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

నిర్లక్ష్యపు నీడలో నిఘా నేత్రం



- నేరాల నియంత్రణకు గత ప్రభుత్వం చర్యలు
- ముప్పాళ్ల మండలంలో 20 సీసీ కెమెరాల ఏర్పాటు
- దొంగతనాలు, చైన్ స్నాచింగ్ కేసుల చేధనకు దోహదం
- నిర్వహణ లోపంతో మరమ్మతులకు గురైన వైనం



గోళ్లపాడులో చోరీకి గురైన సీసీ కెమెరా

ముప్పాళ్ళ: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసుల పనిని సులభతరం చేస్తుంది. నిఘా నేత్రం నుంచి నేరస్తులు, చోరులు తప్పించుకోలేరు. అలాంటి సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఊరిలో సీసీ కెమెరా ఉంటే పోలీసుల నిఘా అక్కడ ఉన్నట్లే అని ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆ నిఘా నేత్రాలు నిర్వహణ లోపం, మరమ్మతుల కారణంగా నిద్దరోతున్నాయి.

అక్రమార్కుల హస్తం

ఏదైనా చైన్ స్నాచింగ్, దొంగతనం జరిగితే ఇళ్ల ముందు పెట్టుకున్న కెమెరాలే ఆధారంగా మారిపోయాయి. పలు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కోతులు ధ్వంసం చేయగా, మరికొన్నింటిని అక్రమార్కులు తమ బండారం బయటపడకుండా ఉండేందుకు.. పనిచేయకుండా చేశారనే విమర్శలున్నాయి. అధికారులు సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించి, మరమ్మతులు చేయించాల్సి ఉంది. పట్టించుకునేవారు లేక సీసీ కెమెరా పరికరాలు ఆనవాళ్లు లేకుండా పోయాయని ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ఘటన జరిగితే మినహా సీసీ కెమెరాల గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు.



నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

శాంతి భద్రతల పర్యవేక్షణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారి వెంబడి అన్ని గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద నిఘా నేత్రాలను అమర్చారు. వీటన్నింటినీ ముప్పాళ్ల పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. ప్రధాన రహదారి పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రాష్ట్ర పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ పట్టించుకునే వారు లేక ప్రస్తుతం అవి పని చేయడం లేదు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు



రాత్రిళ్లు దొంగతనాలు, పట్ట పగలు చైన్ స్నాచింగ్‌లు, అతి వేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఘటనలకు పాల్పడే వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి. అవి పనిచేయక పోవడంతో గ్రామాల్లో దొంగతనాలు అధికమవుతున్నాయి.

–తొరటి అమరలింగేశ్వరరావు, చాగంటివారిపాలెం

మరమ్మతులు చేయిస్తాం

గ్రామాల్లోని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయిస్తాం. కొన్ని చోట్ల కొద్ది పాటి సమస్యలతో పనిచేయడం లేదు. వ్యాపారులు, ఆర్థిక స్తోమత కలిగి వారు తమ గృహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిర్వహణ లోపం లేకుండా చర్యలు తీసుకుంటాం.

–ఎం.వి.సుబ్బారావు, సీఐ, సత్తెనపల్లి రూరల్

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

క్రోసూరు: ఏపీ మోడల్ స్కూల్ ఇంటర్మీడియెట్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో – 2 గణేష్ పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లూర్ధుమేరి, పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతమే లక్ష్యం

బెల్లంకొండ: ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి బాలసుందర రావు, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, ప్రిన్సిపల్ బత్తుల ఉమాదేవి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ: శీతాకాలంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల ఆయుర్వేద వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కేజీబీవీలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. చర్మ సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలే సోపానాలు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, అందుబాటులో ఉన్న అవకాశాలను సోపానాలుగా చేసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగించుకుని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాలను అరికట్టడానికి జిల్లా యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తోందని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. కళాశాలలో విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా అధ్యాపకులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఈఓ నీలావతి, డీఈఓ ఎల్.చంద్రకళ, ఆర్డీఓ జీవీ రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ప్రిన్సిపల్ కొండవీటి పద్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి యువత రాజకీయాలకు సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వర రావు

సత్తెనపల్లి: వామపక్ష భావజాలం కలిగిన యువత నేటి రాజకీయాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం భారత కమ్యూనిస్ట్ పార్టీ సత్తెనపల్లి ఏరియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అధ్యాపకుడు రాయబారం శేషయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పేద, బలహీన వర్గాలకు కామ్యూనిస్ట్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పార్టీకి నూతన సంవత్సరంలో కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుదామన్నారు. పార్టీకి సత్తెనపల్లి ప్రాంతంలో ఎందరో సానుభూతి పరులు, కార్యకర్తలు గతం నుంచి అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ఇక్కడ పార్టీ నిర్మాణంలో నరిశేటి గురవయ్య పాత్ర ఎంతో ఉన్నతమైనదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి మారుతీ, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి యుర్మియా, కంబాల శ్రీనివాస రావు, ఎస్టీయూ, సీపీఐ, రైతు సంఘం, యువజన సంఘం, ప్రజానాట్యమండలి, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

నార్నెపాడులో రెవెన్యూ సదస్సు

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం నాలుగు అర్జీలు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ తోట సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెదమద్దూరులో..

అమరావతి: పెదమద్దూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు నుంచి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు అర్జీలు స్వీకరించారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం



సత్తెనపల్లి: మండలంలోని గుడిపూడిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి పాల్గొని రెవిన్యూకు సంబంధించి–26, సర్వేకు–2, పెన్షన్లకు–4, రైస్ కార్డులకు–32, వెరశి మొత్తం 64 దరఖాస్తులు స్వీకరించారు. మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, ఆర్‌ఐ జోసుబాబు, ఈవో రామకోటిరెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి ఎం.తిరుపతి రావు, గ్రామ సర్వేయర్ రఫీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



నకరికల్లు: ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలోని ఐఈఆర్‌టీ బి.రమేష్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ దృష్టి లోపంతో ఉన్న రమేష్ ఆత్మవిశ్వాసంతో చదువుకొని ఉపాధ్యాయుడిగా స్థిరపడడం ఎందరికో మార్గదర్శకమన్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, ఎంఐఎస్ మండల కో–ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, కంప్యూటర్ ఆపరేటర్ ఎస్.అంజమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ శివకుమారికి ఘన నివాళి



శివకుమారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

రాజుపాలెం: కోటనెమలిపురిలో మాజీ ఎంపీపీ బాసు శివకుమారి 18వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. గ్రామ సమీపంలో స్మృతి చిహ్నంగా ఏర్పాటు చేసిన విగ్రహానికి రాష్ట్ర జలవనరుల శాఖ మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా శివకుమారి భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాసు లింగారెడ్డి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. శివకుమారి ఎంపీపీగా చేసిన కాలంలో మండలంలో చేసిన అభివృద్ధి పనులను పలువురు నాయకులు కొనియాడారు. గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మర్రి సుబ్బారెడ్డి, బెల్లంకొండ ఎంపీపీ చిన్నపరెడ్డి పద్మవెంకటేశ్వరరెడ్డి, జీడీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పాలువాయి ఆదినారాయణ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మర్రి ప్రసాద్‌రెడ్డి, చింతా సాయిరెడ్డి ఉన్నారు.

ఫార్మసీ విద్యతో భవిష్యత్తు బంగారం



జ్యోతి ప్రజ్వల చేస్తున్న రాష్ట్ర కౌన్సిల్ రిజిష్టర్, ప్రిన్సిపల్స్

రాజుపాలెం: ఫార్మసీ విద్యతో భవిషత్తులో స్థిరపడతారని రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిష్టర్ డాక్టర్ విలియం కేరీ అన్నారు. కోటనెమలిపురి పంచాయతీ కొండమోడు సమీపంలో డాక్టర్ అంజిరెడ్డి ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఫార్మసీ విద్యను చదివిన విద్యార్థులు రిటైల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటీవ్ విభాగాల్లో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఫార్మసీ విద్య వల్ల భవిషత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. సొంతగా మెడికల్ షాపులు నిర్వహించుకోవచ్చని, ఫార్మా స్యూటికల్ కంపెనీలలో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. ముందుగా జ్యోతిని ప్రజ్వలన నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మేకల సునీల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ యన్ని ప్రేమజ, ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్, కాలేజీ అడ్మినిస్ట్రేటీవ్ అధికారి క్రోసూరు శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలువురికి అభ్యుదయ రైతు పురస్కారం ప్రదానం



శేషారావుకు పురస్కారం అందిస్తున్న మంత్రి, ఎంపీ



పురస్కారం అందుకుంటున్న రైతు ఆంజనేయులు

పెదకూరపాడు: పెదకూరపాడు గ్రామానికి చెందిన దర్శి శేషారావు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఉత్తమ ప్రకృతి అభ్యుదయ రైతు పురస్కారాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో రైతు నేస్తం ఫౌండేషన్, విజ్ఞాన యూనివర్సిటీ వ్యవసాయ విభాగం సంయుక్తంగా ఈ పురస్కారం అందజేశారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచిన శేషారావును మంత్రి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు సన్మానించారు. జిల్లా అధికారులు ఆయన అభినందనలు తెలిపారు.

బెల్లంకొండ: వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు బంట్రోతు ఆంజనేయులుకు అభ్యుదయ రైతు పురస్కారం దక్కింది. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానంలో పలు రకాల పంటలను పండిస్తూ, పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామ రైతులు అభినందించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న భాష్యం నవీన్

పెదకూరపాడు: స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పుట్టినరోజు సందర్భంగా శ్రీ కాకతీయ ఎడ్యుకేషనల్ సొసైటీ పారిశుద్ధ్య కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు దుస్తులు శనివారం పంపిణీ చేసింది. ముఖ్య అతిథిగా ప్రవీణ్ సోదరులు భాష్యం నవీన్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, గళ్లా బాబు రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ దీవి లలితబాబు, సాంబ శివరావు పాల్గొన్నారు.

ఏఎంసీలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

క్రోసూరు: స్థానిక ఏఎంసీలో శనివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల టీడీపీ శ్రేణులు పాల్గొని, కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్, బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళలర్పించారు.

బాలోత్సవంలో సత్తా చాటిన విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓలు

సత్తెనపల్లి: నరసరావుపేటలో జరిగిన బాలోత్సవంలో తెలుగు పద్య పఠన పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన నూర్ బాషా ఖరీంసా సీనియర్ విభాగంలో ప్రథమ స్థానం, ఎంపీ యూపీఎస్ (హ్యారీస్) నుంచి సీనియర్ విభాగంలో షేక్ ఆయేషా సుల్తానా ద్వితీయ స్థానం, నూర్ బాషా సమీరా కన్సోలేషన్ బహుమతి, జూనియర్ విభాగంలో కొండ్రు సుమతి ప్రథమ స్థానం, దేవర శ్రీనిధి ద్వితీయ స్థానం కై వసం చేసుకొని ప్రతిభ చాటారు. శనివారం మండల వనరుల కేంద్రంలో విజేతలను ఎంఈఓలు ఎ. శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావులు అభినందించారు. తెలుగు ఉపాధ్యాయుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఎం.జానకిదేవి, సీహెచ్ విజయకుమారి, బి.మరియమ్మ, మండల వనరుల కేంద్రం సీఆర్పీలు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పోట్ల అరుణకుమారి

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఒమేగా వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. 40 మంది మహిళలు ఓపీకి హాజరుకాగా 23 మంది మహిళలు డిజిటల్ మామోగ్రఫీ, పాప్ స్మియర్‌తో పాటు బీపీ, షుగర్ తదితర స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ప్రభుత్వ ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మెంబర్ డాక్టర్ పోట్ల అరుణకుమారి ప్రారంభించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు యెల్లినేడి లక్ష్మీ తులసి, జవ్వాజి రామ్మోహన్‌రావు, మారెళ్ళ వీరాంజనేయులు(స్వామి), సిరిగిరి మణికంఠ ఉన్నారు.